ఎడతెరిపి లేకుండా..

- జిల్లాలోని అన్ని మండలాల్లో కుండపోత
- నీట మునిగిన పంట పొలాలు, రోడ్లు
- జలకళను సంతరించుకున్న చెరువులు
- లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని హెచ్చరికలు

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ వద్ద నిలిచిన వరద

తిరుమలగిరిలోని ఓ వీధిలో ప్రవహిస్తున్న వరద

చివ్వెంల : నిండుకుండలా జి తిరుమలగిరి చెరువు

నేరేడుచర్ల/హుజూర్‌నగర్/తిరుమలగిరి, ఆగస్టు 31 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రెండ్రోజులుగా ఎడతేరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు వర్షం కురిసింది. నేరేడుచర్ల మండలం లోని చిల్లేపల్లి, దిర్శించర్ల, పెంచికల్‌దిన్న చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. జాన్‌పహాడ్ రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద కల్వర్టు మీద నుంచి నీరు ప్రవహించడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిపోయిన నీరు సాఫీగా వెళ్లేందుకు మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, కమిషనర్ అశోక్‌రెడ్డి సహాయక చర్యలు చేపట్టారు. వర్షం కారణంగా జాన్‌పహాడ్ మేజర్ పరిధిలోని పలు మైనర్ కాల్వలకు ఎన్ఎస్పీ అధికారులు నీటిని తగ్గించారు. హుజూర్‌నగర్‌లో లింగగిరి రోడ్డు, గోవిందాపురం, అంబేద్కర్ కాలనీలో వరద ఇండ్లలోకి చేరింది. తిరుమలగిరిలో 7 సెం.మీ వర్షం కురిసింది. 4, 5,7వ వార్డుల్లో నీరు రోడ్లపైకి చేరి చెరువులను తలపించాయి.

జాగ్రత్తగా ఉండాలి : ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. కరెంటు పోతే రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వర్షాలకు వాగులు, చెరువులు నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, లోతట్టు ప్రాంత ప్రజలు, పురాతన, శిథిలమైన భవనాల్లో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి : తాసీల్దార్

మఠంపల్లి/మద్దిరాల: వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ మంగా రాథోడ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని కోరారు. అత్యవసర సాయం కోసం డీటీ -93904 95857, ఎంపీడీఓ-99890 59025, ఎస్ఐ 87126 86052, ఆర్ఐ - 81850 73575, ఏఆర్ఐ 96187 50557, మండల విద్యుత్ అధికారి 94408 13587, తాసీల్దార్ - 99580 21466 నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందాల్సిందిగా తెలిపారు. వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని మద్దిరాల తాసీల్దార్ అమీన్‌సింగ్ తెలిపారు.

వరదనీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు

బొడ్రాయిబజార్ : జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువు, నల్ల చెరువులు జలకళను సంతరించుకున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని వీధుల్లో వరద చేరకుండా మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలను పరిశీలిస్తూ అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. పట్టణంలోని అమ్మగార్డెన్, ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీ, 60ఫీట్ల రోడ్డులోని మేజర్ కాల్వలను అధికారులు పరిశీలించారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేశ్, ఆయా వార్డుల జవాన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సూర్యాపేటలో శనివారం సాయంత్రం కుండపోత వర్షానికి ప్రధాన రహదారులపైకి వరదనీరు చేరి ట్రాఫిక్ స్తంభించింది.

అత్యవసర సేవలకు డయల్ 100

అత్యవసరమైతే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సేవలు పొందాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. వర్షాల దృష్ట్యా జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మఠంపల్లి : పొంగి పొర్లుతున్న వేములూరి రిజర్వాయర్

నేరేడుచర్ల : అలుగు పోస్తున్న దిర్శించర్ల చెరువు

నేరేడుచర్ల : రాజీవ్‌నగర్‌లో నీట మునిగిన పంట పొలాలు

బొడ్రాయి బజార్ : సూర్యాపేట పట్టణంలో ప్రవహిస్తున్న వరదనీటిని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

మేళ్లచెర్వు : భారీ వర్షంతో నీట మునిగిన పంట పొలాలు

గరిడేపల్లి మండలం అబ్దిరెడ్డి గూడెం నుంచి సర్వారం వెళ్లే రహదారి మీది నుంచి ప్రవహిస్తున్న తాళ్లవాగు

పాలకవీడు : జాన్‌పహాడ్‌లో నీట మునిగిన పంట పొలాలు

పటిష్ట బందోబస్తు మధ్య గణేశ్ ఉత్సవాలు

- ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

బొడ్రాయిబజార్, ఆగస్టు 31 : జిల్లాలో గణేశ్ నవరాత్రోత్సవాలకు పటిష్టమైన పోలీస్ భద్రత ఉంటుందని, భక్తులు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండపాల నియమ నిబంధనలు పాటించాలని, డీజేలకు అనుమతి లేదని సూచించారు. మండపాలను రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయొద్దని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు https://policeportal.tspolice.gov.in/index.htm వెబ్‌సైట్ ద్వారా అనుమతులు పొందాలని చెప్పారు. సంబంధిత అధికారులు అప్లికేషన్‌ను పరిశీలించి అనుమతులిస్తారన్నారు. పబ్లిక్ స్థలంలో మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లైతే సంబంధిత గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ నుంచి అనుమతి పత్రం తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ వ్యక్తుల స్థలం అయితే యజమాని నుంచి అనుమతి పత్రం తీసుకోవాలని కోరారు. ఉత్సవాలు ముగిసే వరకు కమిటీ సభ్యులు 24గంటల పాటు మండపాల వద్ద అందుబాటులో ఉండాలని భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వివాదస్పద స్థలాల్లో గణేశ్ మండపాలు ఏర్పాటు చేయొద్దని, ఇతరులను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయొద్దని పేర్కొన్నారు. అవాంఛనీయ ఘటనలకు అర్జీదారులు, ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. రాత్రి 10గంటల్లోపు మాత్రమే స్పీకర్లకు అనుమతి ఉందన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి

పదోన్నతి పొందిన సిబ్బందితో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులు

బొడ్రాయిబజార్, ఆగస్టు 31 : జిల్లా స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీలో పని చేస్తున్న మహిళా హెడ్ కానిస్టేబుళ్లు అరుణదేవి, కవిత, జ్యోతిలతో పాటు పోలీస్ కంట్రోల్ రూంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న గోపాల్‌ల ఏఎస్ఐలుగా పదోన్నతి లభించింది. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ శనివారం ప్రమోషన్ పత్రాలను సిబ్బందికి అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, పోలీస్ సంఘం అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగ విరమణ : మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగయ్య శనివారం ఉద్యోగ విరమణ పొందగా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఎస్పీ కార్యాలయంలో నాగయ్య దంపతులను సన్మానించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

SSC & ఇంటర్ సర్టిఫికెట్స్ పోయినవి
సంటి రంగారెడ్డి, S/o. సంటి రాంరెడ్డి, గ్రా॥యెరెడ్లగూడెం (మం) గుర్రంపోడ్, నల్లగొండ జిల్లా నివాసినైన నా యొక్క ఒరిజినల్ SSC (Hall Ticket No.1929118413) మరియు ఇంటర్ మీడియట్ సర్టిఫికెట్స్ మొసంగి నుండి గుర్రంపోడ్ ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినవి దొరికినవారు సంప్ర॥7569357520.
NLG-

ADMISSIONS
★Seats available in Engineering, Medical & other Courses in Colleges of Hyderabad. Contact: 7799111873, 7799111874.
NT-333107-All

HOUSE FOR SALE
★4BHK Duplex Villa 2200 Sft. in 300 Yds. in Doctors Cly., Behind White House, S/F, Just 10 Min. Walk to Metro, Malls. Rs. 3.50 Cr. 7671062499.
NT-326244

PLOT FOR SALE
★అబ్దుల్లాపూర్‌మెట్, లస్కర్‌గూడ, ఫిలింసిటీకి ప్రక్కన 100, 200 గజాల ప్లాట్ అమ్మబడును (నో బ్రోకర్స్). ఆసక్తిగలవారు సం॥ 9390189907.
NT-332596

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

PLOT FOR SALE
★హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ... శ్రీశైలం హైవే HMDA, DTCP ప్లాట్లు కలవు. ఇప్పుడు మాత్రమే తక్కువ ధరలో మహేశ్వరం, ముచ్చర్ల... మరో న్యూయార్క్. Cont: 8008091512.
NT-332640

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 31 : గడువులోగా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి సీఎంఆర్ సేకరణపై మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023-24 వానకాలం, యాసంగి సీజన్ లక్ష్యాన్ని సెప్టెంబర్ 30వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. గతంలో సీఎంఆర్ చెల్లించని వారిపై , నిర్లక్ష్యంగా వ్యవహరించిన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పెండింగ్ బకాయిలపై సివిల్ సప్లయ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మిల్లర్లు, అందరు ఏబీ రిజిస్టర్లు నిర్వహించాలని ప్రత్యేక బృందాల ద్వారా మిల్లులను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కువ పెండింగ్ ఉన్న మిల్లర్లు మూడు షిఫ్టుల్లో మిల్లులు నడిపించి చెల్లింపులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రోజు డెలవరీ రిపోర్టును పంపాలని ఆదేశించారు. లక్ష్యం పూర్తి చేసిన మిల్లులకే ధాన్యం కేటాయింపులు ఉంటాయని చెప్పారు. సమావేశంలో డీఎస్ఓ డి. రాజేశ్వర్, డీఎం సివిల్ సప్లయ్ ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, రాంరెడ్డి, నాగలక్ష్మి, విజయ శేఖర్, మిల్లర్లు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలి : ఆర్డీఓ వేణుమాధవరావు

మద్దిరాల : ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ లిస్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

నూతనకల్/ మద్దిరాల/ తిరుమలరి(నాగారం), ఆగస్టు 31 : ఓటర్ జాబితా సవరణలో అలసత్వం లేకుండా పగడ్బందిగా చేపట్టాలని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. నూతనకల్, నాగారం, మద్దిరాల మండల కేంద్రాల్లోని తాసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను శనివారం ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ఓటర్ జాబితాను వార్డుల వారీగా సరిచేయాలన్నారు. జాబితాను ఈనెల 6న గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నోటీస్ బోర్డులపై డ్రాఫ్ట్ చేయాలని సూచించారు. 7వ తేదీ నుంచి 13వరకు తప్పులుంటే అభ్యంతరాలు స్వీకరిస్తామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక తాసీల్దార్లు, ఎంపీడీఓలు అధికారులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి : ఆర్డీఓ శ్రీనివాసులు

నేరేడుచర్లలో అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

నేరేడుచర్ల,ఆగస్టు 31 : మున్సిపాలిటీ, మండలాల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని హుజూర్ నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఓటరు జాబితా ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పోలింగ్ కేంద్రాలను త్వరితగతిన గుర్తించాలన్నారు. ఈనెల 15 నాటికి ఓటరు జాబితాను పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎండీఓ కార్యాలయంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రక్రియను పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీఓ సోమసుందర్ రెడ్డి, తాసీల్దార్ శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, డీటీ మౌనిక, సర్వేయర్ గాయత్రి, సిబ్బంది కోటి ఉన్నారు.

ఐఐఎం కోజీకోడ్‌లో కోదాడ యువతికి సీటు

సుప్రజ

కోదాడటౌన్, ఆగస్టు 31 : దేశంలోని విద్యాసంస్థల్లో అగ్రగామి అయిన కోజీకోడ్ ఐఐఎంలో కోదాడకు చెందిన శేకు రమేశ్-నాగరాణి కుమార్తె సుప్రజ ఎంబీఏలో సీటు సాధించింది. జూలై నెలలో దేశవ్యాప్తంగా జరిగిన ఈఎంఏటీ ఎంట్రెన్స్ టెస్టులో సుప్రజ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పట్టణం నుంచి సీటు సాధించిన తొలి విద్యార్థినిగా రికార్డు సాధించింది. హైదరాబాద్‌లో బీటెక్ పూర్తిచేసిన సుప్రజ ప్రస్తుతం ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది.

వారానికోసారి ప్రజా దర్బార్ పెట్టాలి : సీపీఐ

నేరేడుచర్ల, ఆగస్టు 31 : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వారానికి ఒకసారి ప్రజాదార్బార్ పెట్టి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి సామాన్య ప్రజలు మంత్రిని కలుసుకోలేక పోతున్నారన్నారు. ఎల్లబోయిన సింహాద్రి, ముళ్ల జానయ్య, శ్రీనివాస్ రెడ్డి, రావుల సత్యం ఉన్నారు.

ఆర్థికసాయం

బొడ్రాయిబజార్, ఆగస్టు 31 : జిల్లా కేంద్రంలోని బొడ్రాయిబజార్‌కు చెందిన జెల్ల వెంకన్న మనుమరాలు ఆయుశ్రీ తలకు శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. నిరుపేద కుటుంబానికి చెందిన వారికి ఆపరేషన్‌కు డబ్బు లేక పోవడంతో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు, వ్యాపార వేత్త గండూనరి కృపాకర్ స్పందించి రూ.10వేలు ఆర్థికసాయం చేశారు.

సమాజసేవ చేయాలి

- డివిజన్ విద్యాధికారి సలీంషరీఫ్

కోదాడ రూరల్, ఆగస్టు 31 : ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం సమాజసేలో పాల్గొనాలని కోదాడ డివిజన్ విద్యాధికారి సలీం ఫరీఫ్ అన్నారు. కోదాడ బాలుర ఉన్నత పాఠశాల సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయుడు కే. పూర్ణచందర్‌రావు ఉద్యోగ విరమణ సభలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంచార్జి హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, వీరారెడ్డి, దేవుల పల్లి వెంకటేశ్వర్‌రావు, మినాక్షి, పద్మావతి, సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరణ

చివ్వెంల/సూర్యాపేట(ఆత్మకూర్.ఎస్)/ తిరుమలగిరి, ఆగస్టు 31 : చివ్వెంల మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో ఏఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రుణమాఫీ కానీ రైతులు, రేషన్ కార్డులేని వారి నుంచి వ్యవసాయ శాఖ శనివారం దరఖాస్తులు స్వీకరించారు. ఆత్మకూర్.ఎస్ మండలంలో ఏఓ దివ్య ఏఈఓలతో కలసి గ్రామాల్లో తిరుగుతూ కుటుంబ సభ్యుల ఆధార్, ఇతర వివరాలు సేకరిస్తూ నిర్ధారణ చేపటారు. తిరుమలగిరి మండల పరిధిలోని తాటిపాముల, గుండెపురి గ్రామాల్లో రుణమాఫీ సర్వే నిర్వహించారు.

నేటి నుంచి పశు గణన

సూర్యాపేట (ఆత్మకూర్.ఎస్),ఆగస్టు 31 : నేటి నుంచి డిసెంబర్ 31 వరకు మండల వ్యాప్తంగా పశు గణన నిర్వహించనున్నట్లు మండల పశు వైద్యాధికారి వేణుగోపాల్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గణనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి : సీపీఐ

బొడ్రాయిబజార్, ఆగస్టు 31 : నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ధర్మభిక్షం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్‌కుమార్, దీకొండ శ్రీనివాస్, రేగటి లింగయ్య ఉన్నారు.

సక్కమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

సూర్యాపేట రూరల్/బొడ్రాయి బజార్, ఆగస్టు 31 : పట్టణ పరిధిలోని పిల్లలమర్రి గ్రామానికి చెందిన చింతలచెర్వు సక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల శంకర్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మృతులకు శనివారం వేర్వేరుగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, నాయకులు గండూరి ప్రకాశ్, రాపర్తి సైదులు గౌడ్, కౌన్సిలర్ వల్దాస్ సౌమ్య జాని, మహేశ్వరి, ప్రవీణ్, శ్రీను పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి : డీఈఓ అశోక్

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ అశోక్

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 31 : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని డీఈఓ అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యను అందించమే కాక సామాజిక బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వర్తించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరిండెంట్ శ్రీకాంత్ భట్, రేపాక లింగయ్య, ప్రశాంతి, డాక్టర్ రంగారెడ్డి, కొల్లు శ్రీనివాస్, వీరయ్య, భీమరాజు, అంతయ్య, దేవేందర్, రమాదేవి, సిరి చందన, జాగృతి పాల్గొన్నారు.

సుదీర్ఘ సేవలు అభినందనీయం : ఆర్టీసీ డీఎం

ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం సురేందర్

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 31 : ఆర్టీసీలో 37 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలు అందించిన ఉద్యోగుల సేవలు మరువలేనివని ఆర్టీసీ డీఎం డి.సురేందర్ అన్నారు. అసిస్టెంట్ మేనేజర్(పి) నర్రా వెంకట్‌రెడ్డి, డ్రైవర్ టి.రామారావు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం నూతన సూపరిండెంట్ జి.రమశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బి.సైదులు, ఎంపీసీ రావు, సుంకరి శ్రీనివాస్, ఎల్‌సీ సైదులు, ఎస్ఎస్ గౌడ్, ఎన్.లచ్చయ్య, వి.అంజయ్య, బి.సైదులు, ఆర్ఆర్ రావు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి : డీఎంహెచ్ఓ కోటాచలం

నూతనకల్ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం

నూతనకల్, ఆగస్టు 31 : వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా ప్రైవేట్ దవాఖానలను కూడా తనిఖీ చేశారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ చరణ్, సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాజుల చంద్రశేఖర్ అన్నారు. అర్వపల్లి పీహెచ్‌సీని శనివారం ఆయన తనిఖీ చేసి రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ మణిదీప్, మాలోతు బిచ్చునాయక్, లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దరి చేరవని ఎంపీడీఓ పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని పర్సాయపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం పిచ్చి మొక్కలు తొలగించి మాట్లాడారు.